RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 247

ఆదివారం
ఆగస్టు 31, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00




ఘనంగా లక్ష్మీ గణపతి హెూమం

2లో..



- క్రిటికల్ కేసులకూ ట్రీట్‌మెంట్!
- వారికే అంతా తెలుసో.. ఏమో మరి..?
- ఇంత జరుగుతున్నా జిల్లా వైద్య శాఖ అధికారుల ఉదాసీనత
- జనం ప్రాణాలతో చెలగాటమాడుతున్నా చర్యలకు జంకు ఎందుకో?
- ప్రజా ప్రభుత్వంలో ప్రజల ప్రాణ రక్షణ, భద్రతపైన పట్టింపు ఉట్టి మాటలేనా?

# అర్హతకు మించిన వైద్యం..!?



**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

పది, ఇంటర్ లేదా సాధారణ డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హతకు మించి వైద్యం చేస్తున్నారు.! అంతే కాదు.. వారు ఎంబీబీఎస్ చదివిన డాక్టర్లను మించి క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని చికిత్సలు చేస్తూ.. అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మండల కేంద్రాలతో పాటు పట్టణ ప్రాంతాలలో ఇలాంటి క్లినిక్‌లు ఇష్టారీతిన వెలుస్తున్నాయి. తక్కువ ఖర్చుతో వైద్యం అందుతుందనే భావనతో ప్రజలు ఎక్కువగా ఆర్ఎంపీలనే సంప్రదిస్తున్నారు. ఇదే అదునుగా వారు వచ్చిరాని వైద్యం చేస్తున్నారు. సాధారణంగా ఎంబీబీఎస్ వైద్యులు సైతం ఏదైనా కేసును పూర్తిగా స్టడీ చేశాక.. లేదా మరో నిపుణుడైన వైద్యుడి ఒపీనియన్ తీసుకున్నాకే ట్రీట్‌మెంట్ ఇస్తుంటారు. కానీ, వీరు మాత్రం 'అంతా తమకే తెలుసు..' అన్నట్టుగా.. క్రిటికల్ కేసులకూ జంకడం లేదు. అధిక మోతాదులో యాంటీబయాటిక్, పెయిన్ కిల్లర్స్ ఇస్తూ..

అడ్డగోలుగా సూది మందులు అందిస్తున్నారు. అలా ఇష్టమొచ్చినట్టుగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కొందరు ఆర్ఎంపీలపై చర్యలకు మాత్రం జిల్లా వైద్యశాఖ అధికారులు ఎందుకో వెనకాడుతున్నారు.!

**– కమీషన్లకు కక్కుర్తి!**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆర్ఎంపీలు కొందరు సరైన శిక్షణ తీసుకుని వైద్య సేవలు అందిస్తున్నారు. మరికొందరు వైద్యుల వద్ద శిక్షణ పొంది సేవలందిస్తున్నారు. కానీ, ఇంకొందరు మాత్రం ఎలాంటి శిక్షణ, అర్హత లేకుండానే 'డాక్టర్ల'మంటూ బోర్డులు ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రామ, పట్టణాలలో ఇష్టారీతిన క్లినిక్‌లు ప్రారంభిస్తున్నారు. రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే అందించి.. సకాలంలో ఆస్పత్రులకు పంపించాల్సిన వారు.. హద్దులు దాటి చికిత్స అందిస్తున్నారు. జ్వరాల బారిన పడిన వారికి ఏకంగా సెలైన్ బాటిళ్లు ఎక్కిస్తున్నారు. మండల కేంద్రాలలో అయితే ఇష్టానుసారంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేసి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. అంతేగాకుండా కమీషన్లకు ఆశపడి తమకు నచ్చిన ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు రోగులను సిఫారసు చేస్తున్నారు.

**– పొంచిన వ్యాధుల ముప్పు**

ప్రస్తుత వానాకాలం సీజన్ నేపథ్యంలో ఈగలు, దోమలు బాగా వృద్ధి చెందుతాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా పలు చోట్ల పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధులు దోమలతోనే వ్యాప్తి చెందుతాయి. ఇటీవల జిల్లాలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లాకు చెందిన ఒకరికి డెంగ్యూ నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుత సీజనల్ డిసీజెస్ సీజన్‌లో జనం చాలా వరకు ఆర్ఎంపీల వద్ద వైద్యం చేసుకుంటున్నారు. అలా ట్రీట్‌మెంట్ తీసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. కాగా, ప్రాథమిక చికిత్స చేయాల్సిన వారు ఇంజక్షన్లు ఇవ్వడంతోనే ఆపడం లేదు. కొందరు అయితే ఏకంగా ప్రిస్క్రిప్షన్ రాస్తున్నట్టు తెలుస్తోంది. నిజానికి వారు నిబంధనల ప్రకారం.. ప్రిస్క్రిప్షన్ రాయడానికి వీల్లేదు. కానీ, తామే పెద్ద వైద్యులన్నట్టుగా కొందరు వ్యవహరిస్తున్నట్టు సమాచారం. డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులను సైతం ఆర్ఎంపీలు నేరుగా నిర్ధారించి.. చికిత్స అందిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినబడుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించి.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆర్ఎంపీల క్లినిక్‌లపై నిఘా ఉంచడమే కాకుండా తనిఖీలు నిర్వహించి.. తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ప్రాణ భద్రత, సం'రక్షణ', మెరుగైన వైద్యం సకాలంలో అందేలా అధికారులు తమ విధులను కర్తవ్యదీక్షతో నిర్వర్తించాలని సూచిస్తున్నారు.

# నానో యూరియా వల్ల అనేక లాభాలు

**– వ్యవసాయ అధికారి గంగాజమున**



**వేద న్యూస్, శాయంపేట:**

వానాకాలం సీజన్ కు గాను ఇప్పటివరకు పిఎసిఎస్ శాయంపేట ద్వారా, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాల ద్వారా, ఓడిసిఎం ఎస్ ల ద్వారా ప్రైవేటు డీలర్ల ద్వారా పన్నెండు వందల ముప్పై ఐదు టన్నుల యూరియా శాయంపేట మండలానికి అందించారని మండల వ్యవసా య అధికారి గంగాజమున తెలిపారు. ఇదే కాకుండా ఏడువందల యాభై లీటర్ల నానో యూరియా కూడా రైతులకు అందించారని తెలిపారు. ఇంకా నాలుగు వందల డెబ్బై మూడు లీటర్ల నానో యూరియా మండలంలో గల వివిధ షాపులలో అందుబాటులో ఉందని తెలిపారు.నేటి ఉదయం వరకు ప్రగతి సింగారంలో గల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి ఇరవై టన్నుల యూరియా, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం శాయంపేటకు ఇరవై టన్నుల యూరియా, సాయి ఫెర్టిలైజర్స్ శాయంపేటకు పదిహేను టన్నుల యూరియా,గట్ల కనపర్తి లో గల శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపుకు ఐదు టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంటుంది అని తెలిపారు.కావున మండలంలో గల రైతులు యూరియా విషయంలో కంగారు పడవలసిన అవసరం లేదు . యూరియా పంపిణీ అవగానే మళ్ళీ యూరియా తెప్పించడం జరుగుతుంది అని మండల వ్యవసాయ అధికారి గంగాజమున తెలిపారు. రైతు సోదరులకు విజ్ఞప్తి ఏమనగా ఇప్పుడు పత్తిలో వేయబోయే రెండవ దఫా లేదా మూడవ దఫా నానో యూరియా వాడవల్సిందిగా విజ్ఞప్తి చేశారు. నానో యూరియా వల్ల లాభాలు అనేకసార్లు వివరించడం జరిగింద అని తెలిపారు.దయచేసి అపోహలు తీసివేసుకొని నానో యూరియాని వాడవలసిందిగా రైతులకు మండల వ్యవసాయ అధికారి గంగాజమున తెలిపారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



ఖిలా వరంగల్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుటలో భాగంగా చేపడుతున్న అభివృ ద్ధి , సుందరికారణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కుడా వైస్ చైర్పర్సన్, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ కుడా అధికారులతో కలిసి ఖిలా వరంగల్ లోని తూర్పు, పడమర, పశ్చిమ, ఉత్తర కోటలలో క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ గుండు చెరువు సుందరికరణ పనులను పరిశీలించారు. గుండు చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయడంలో భాగంగా చేపడుతున్న అడ్వెంచర్స్ స్పోర్ట్స్, వాకింగ్ ట్రాక్, ఫుడ్ కోర్ట్ పనులను పరిశీలించారు. కోట చుట్టూ మోట్ జీవ పునరుద్ధరణ (బయో డైవర్సిటీ) పనులను త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కుడా పిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీం రావు, డీఈ తదితరులు పాల్గొన్నారు.

# టౌన్ ప్లానింగ్ అధికారిపై సీఎం, సీఎస్ కు ఫిర్యాదు

**వేద న్యూస్, హుజురాబాద్:**

హుజురాబాద్ పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారిపై హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ నుండి మొదలుకొని జిల్లా కలెక్టర్ మరియు కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కి మరియు డిటి అండ్ సిపి డైరెక్టర్ కి ఫిర్యాదు చేసినప్పటికీ సదరు అధికారిపై చర్యలు తీసుకోవడం లేదని ఇట్టి విషయమై న్యాయపోరాటం చేస్తానని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ మెంబర్ కొలుగూరి సూర్య కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ పట్టణంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అధికారులు జేబులు నింపుకుంటున్నారని పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ విచారణ జరపకుండా చర్యలు తీసుకోకుండా అధికారులు చోద్యం చూస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా మరియు సెట్ బ్యాక్ తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారని ఒకవేళ అనుమతులు తీసుకుంటే తూతూ మంత్రంగా కొంత స్థలానికి అనుమతులు పొంది తన ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఇట్టి నిర్మాణాలపై బాధ్యతాయుతంగా నిరంతరం పర్యవేక్షించి చర్యలు తీసుకోవలసిన టౌన్ ప్లానింగ్ అధికారి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పేదోళ్లకు ఒకరకంగా బడా బాబులకు అండగా ఉంటున్నారని మండిపడ్డారు. తక్షణమే సదరు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయమై స్పందించి విచారణ జరిపి సదరు టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో న్యాయపో రాటం చేస్తానని టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకునేంతవరకు వదిలే ప్రసక్తి లేదని తెలిపారు.



# నిమజ్జనం ప్రదేశాలను పరిశీలించిన అధికారులు



**వేద న్యూస్,శాయంపేట:**

తహసిల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ, ఎలక్ట్రిసిటీ ఏ ఈ ,పంచాయతీ కార్యదర్శి లు గణేష్ నిమజ్జనం జరగబోయే ప్రదేశాలు ప్రగతి సింగారం , దేవుని చెరువు పరిశీలించారు. అక్కడ కావలసిన వసతుల గురించి సంబంధించిన అధికార్లు కు ఆదేశించారు.శాయంపేట మండలం లో ఉన్న డీజే సౌండ్ సిస్టమ్ నిర్వకులకు పదమూడు మంది కి ఎస్ఐ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాడనికి తహసీల్దార్ శాయంపేట ముందు డీజే నిర్వాహకు లను బైండ్ ఓవర్ చేశారు.

వేద న్యూస్

ఆదివారం ఆగస్టు 31, 2025

# సిటీ కాలేజి ఫిజిక్స్ విద్యార్థుల క్షేత్ర పర్యటన




**వేద న్యూస్, హైదరాబాద్ :**

సిటీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన 50 మంది స్టాండర్డ్ క్లబ్ విద్యార్థులు జీడిమెట్ల,హైదరాబాద్‌లోని శ్రిష్టి ఎలక్ట్రికల్స్ పరిశ్రమను సందర్శించారు. ఈ పరిశ్రమ వివిధ రకాల విద్యుత్ ఫ్యాన్ల తయారు చేస్తుంది. ఈ క్షేత్ర పర్యటనను స్టాండర్డ్ క్లబ్ మెంటర్ డా.వై.వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో, భారత ప్రమాణాల బ్యూరో హైదరాబాద్ శాఖ సహకారంతో నిర్వహించారు. విద్యార్థులకు పారిశ్రామిక ప్రక్రియలపై అవగాహన కల్పించడం, తరగతి గదిలో నేర్చుకున్న సైద్ధాంతిక భావనలు ప్రాక్టికల్ స్థాయిలో ఎలా ఉపయోగపడతాయో చూపించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ సందర్భంగా సిటీ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బాలభాస్కర్ శుభాకాంక్షలు తెలుపుతూ భౌతిక శాస్త్ర విద్యార్థుల కోసం పరిశీలనాత్మక విద్య అత్యంత ముఖ్యమని అన్నారు. క్షేత్ర పర్యటన సమన్వయం చేస్తున్న డా.వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ సైద్ధాంతిక జ్ఞానాన్ని ప్రాయోగిక దృక్పథంతో అనుసంధానించడం భౌతిక శాస్త్ర విద్యలో తప్పనిసరి అంశమని పేర్కొన్నారు. ఈ పర్యటనలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు పి.ఆర్.రతన్‌కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులు పరిశ్రమలోని అధికారులతో చర్చించి, తయారీ ప్రక్రియలను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు, భద్రతా చర్యలు, ఆవిష్కరణలపై విలువైన విషయాలను తెలుసుకున్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన బిఐఎస్ హైదరాబాద్ శాఖకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టాలి

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**




పదవీవిరమణ చేసిన పోలీస్ అధికారులు తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సుధీర్ఘ కాలం పని చేసి పదవీవిరమణ చేసిన పోలీస్ అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదివారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. పదవీ విరమణ పొందిన వారిలో, ఎస్. ఐలు యాకుబ్ మొహినూద్దీన్, మహమ్మద్ అలీ, రాధే శ్యామ్ శర్మ, యాదగిరి, నందమ చారి, ఏ.ఎస్. ఐలు జీలాని, సురేందర్, హెడ్ కానిస్టేబుళ్ళు ముత్తయ్య, యాకుబ్ పాషా, శ్రీనివాస్ వున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తమరి సేవలు నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తాయని, నేటి ఈ ప్రశాంత వాతావరణానికి తమ సేవలే కారణమని, తాము అందించిన సేవలు మరువమని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమములో అదనపు డిసిపిలు రవి, శ్రీనివాస్, ఏసీపీ సురేంద్ర,ఆర్. ఐలు సతీష్,స్పర్జన్ రాజ్,శ్రీనివాస్, శ్రీధర్ చంద్రశేఖర్, ఆర్. ఎస్. ఐ శ్రవణ్ తో పాటు పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# చిన్నారి వైద్యానికి కలెక్టర్ ఆర్థిక చేయూత

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



చిన్నారి వైద్యానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్థికంగా చేయూతను అందించారు. సిరిసిల్లలోని శివ నగర్ కు చెందిన వేముల మధు దంపతులకు కవలలు (కొడుకు, కూతురు) జన్మించారు. అనారోగ్య సమస్యతో కూతురు ఆసుపత్రిలో మరణించారు. కొడుకు హైదరాబాద్ లోని దవాఖాన లో చికిత్స పొందుతున్నాడు. తమ కొడుకు వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని వేముల మధు కలెక్టర్ కు విన్నవించారు. దీంతో వెంటనే స్పందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.చిన్నారి వైద్యానికి రూ. 50 వేల చెక్కును జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అందజేశారు. చిన్నారి చికిత్సకు భరోసా ఇచ్చారు. క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం సిరిసిల్ల పట్టణానికి చెందిన బోనాల వెంకటేష్ క్యాన్సర్ తో బాధపడుతున్నాడు. తన వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వెంకటేష్ విన్నవించారు. దీంతో స్పందించిన కలెక్టర్ ...బోనాల వెంకటేష్ వైద్యానికి రూ. 1,25,000 ఆర్థిక సహాయం అందజేశారు. తమ బాధను అర్థం చేసుకొని ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు చిన్నారి, క్యాన్సర్ రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# టిడిఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ డిటిఎఫ్ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్, పూర్వ జిల్లా అధ్యక్షులు ఏ. రాజేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.తిరుపతి, లు మాట్లాడుతూ ఉపాధ్యాయ,ఉద్యోగుల పిఆర్సి, అలాగే పెండింగ్ డీఏలు,వంటి బకాయిల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్సి నివేదికను అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, పెండింగ్లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలని, పెన్షనర్లకు పెండింగ్లో ఉన్న బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిటిఎఫ్ బోయినిపల్లి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం: అధ్యక్షులు ఏ.ప్రతాపరెడ్డి,ఉపాధ్యక్షులు కె. నరేందర్ రావు,ఎన్. శోభారాణి, డి. రఘు చారి,ప్రధాన కార్యదర్శి కే. తిరుపతి,కార్యదర్శులు జి. రాజశేఖర్,బి. సుమలత, ఎస్. సంపత్ కుమార్,ఆడిట్ కమిటీ కన్వీనర్ జి. నరసయ్య,ఆడిట్ కమిటీ సభ్యులు ఎ. మల్లయ్య, పి. శ్రీనివాస్,జిల్లా కౌన్సిలర్లు జి. జీవన్ రెడ్డి,2. కే.రవీందర్ రెడ్డి:బి. శ్రీనివాస్, ఆర్. శ్రీనివాస్ రెడ్డి, ఎం. పర్ష రాములు,ఎన్నికల అధికారి ఏ. రాజేశ్వరరావు,రాష్ట్ర కౌన్సిలర్, డిటిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా పూర్వ అధ్యక్షులు,ఎన్నికల పరిశీలకులు వంగ తిరుపతి,డిటిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఎన్నుకున్నారు.

# ఆపదలో భరోసా సీఎంఆర్ఎఫ్



**వేద న్యూస్, చొప్పదండి/ గంగాధర :**

అనారోగ్యంతో బాధపడుతూ, ప్రమాదంలో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం భరోసా కల్పిస్తోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద రూ. 22,56,500 విలువైన ఆర్థిక సహాయం మంజూరు అయింది. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు శనివారం గంగాధర మండలం మధురానగర్ లోని ఎమ్మెల్యే ప్రజా కార్యాలయంలో లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆపదలో తమను ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ తోట కరుణాకర్, బుర్గు గంగన్న, సాగి అజయ్ రావు, సత్తు కనుకయ్య, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, రెండ్ల రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గరికంటి కరుణాకర్, ముచ్చ శంకరయ్య, దొమ కొండ మహేష్, మల్లయ్య, శంకర్, మ్యాక వినోద్, ఎమిరెడ్డి నాగేంద్రర్ , శ్రీనివాస్, మంత్రి మహేందర్, పవుల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ జాగిలానికి పదవీ విరమణ

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో 12 వసంతాలు సేవలందించిన పోలీస్ జాగిలం బ్రోనో కు పోలీస్ అధికారులు పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సుధీర్ఘ కాలంగా సేవలందించిన బ్రోనో ను ఘనంగా సత్కరించారు. ట్రాకర్ జాగిలంగా గుర్తించబడిన బ్రోనో పోలీస్ శాఖలో చేరిన నాటి నుండి 15 కేసులు నిందితులను గుర్తించడంతో పాటు జాతీయ పోలీస్ డ్యూటీ మీట్లలో బ్రోనో పలు పతకాలను సాధించింది. ప్రస్తుతం దీని శిక్షకుడిగా హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ వ్యవహారించారు.

# ఘనంగా లక్ష్మీ గణపతి హెూమం



**వేద న్యూస్, మడికొండ :**

మడికొండ నెహ్రూనగర్ లో సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ గణపతి హెూమం శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధమ నవరాత్రి ఉత్సవాల లో మట్టి గణపతి నెలకొల్పారు. ఈ సందర్భంగా శనివారం రావికంటి వాసవి చంద్రశేఖర్ లు దాతలుగా వ్యవహరించి అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సీఐ పుల్యాల కిషన్ హాజరై స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాదాపు 350 మందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో నిర్వహించారు. అనంతరం వరంగల్ గణపతి నవరాత్రి ఉత్సవ సమితి సిద్ధి వినాయక కమిటీ నెలకొల్పిన మట్టి విగ్రహాన్ని సందర్శించి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వృద్ధులు,దివ్యాంగులకు సమస్యలను సత్వరంగా పరిష్కరించాలి

**వేద న్యూస్,వరంగల్:**




వృద్ధులు, దివ్యాంగులు ప్రత్యేక ప్రజావాణిలో అందించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సత్వరంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వయోవృద్ధులు, దివ్యాంగులకు నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వృద్ధులు, దివ్యాంగుల నుంచి పలు దరఖాస్తులు స్వీకరించారు. అర్జీదారులు అందించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని అన్నారు.గత నెల ప్రజావాణి సందర్భంగా వచ్చిన సమస్యల పరిష్కారంపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని, పెండింగ్ దరఖాస్తులు ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రకాళి అమ్మవారిని దర్శించిన ఆర్టిఐ కమిషనర్స్

**వేద న్యూస్, వరంగల్:**



కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో పరమపావనమైన పుణ్యక్షేత్ర ంగా విరాజిల్లుతున్న భద్రకాళి దేవస్థానాన్ని తెలంగాణా రాష్ట్ర ఆర్.టి.ఐ కమీషనర్ లు పి.వి శ్రీనివాసరావు,బి. అయోధ్య రెడ్డిలు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన కమీషనర్లకు ఆలయ అధికారులు, అర్చకులు మంగళవాద్యాలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ స్నపన మండపంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.టి.ఐ సిబ్బంది మరియు దేవాలయ పర్యవేక్షకులు కాంతికుమార్, సిబ్బంది తదితరులున్నారు.

# అన్నదానం మహాదానం



**వేద న్యూస్, హుజురాబాద్ ప్రతినిధి:**

వీణవంక మండలంలోని కొండపాక గ్రామంలో నల్లగాశ శ్రీనివాస్ యాదవ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ దంపతులు మాట్లాడుతూ.. ఆ సిద్ధి వినాయకుని ఆశీస్సులతో అందరూ బాగుండాలని , ప్రతి సంవత్సరం ఇలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నల్లగాశ శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సభ్యుల తోపాటు కమిటీ సభ్యులు మ్యాడగోని సదయ్య గౌడ్, గుర్రం రాజు లక్ష్మణ్ రాచకట్ల సురేష్ అంబటి రామచందర్ సల్పాల అశోక్, కాటు నరేందర్ ఆవాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ కు వాటర్ ప్యూరిఫైర్ అందజేత




**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు త్రాగునీటికి సమస్య ఉందని తెలుసుకొని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నాయని అంజలి,21 లీటర్ల వాటర్ ప్యూరిఫైర్ ను స్కూల్ కు బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో జి. గురుదేవ్, ఉపాధ్యాయుడు వి. రాజశేఖర్, విద్యార్థులు, ఉన్నారు.

# కీర్తి రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు




**వేద న్యూస్,శాయంపేట:**

భూపాలపల్లి నియోజకవర్గం ఇన్చార్జి పేద ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నటువంటి బిజెపి పార్టీ కార్యకర్తల కష్టసుఖాల్లో వెన్నుదన్నుగా ఉన్నటువంటి చందుపట్ల కీర్తికి శాయంపేట బిజెపి మండల నాయకులు హనుమకొండలో వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి ,మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐ దామోదర్ యాదవ్ ఆపన్న హస్తం



**వేద న్యూస్, చొప్పదండి** :మండలం మల్లాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ గంధం వరలక్ష్మి భర్త, బీఆర్ఎస్ నాయకులు గంధం నారాయణ ఇటీవలే విద్యుత్ షాక్ తగిలి మృతి చెందగా వారి కుటుంబానికి ఎన్నారై కొలుముల దామోదర్ యాదవ్ అండగా నిలిచారు. శనివారం బాధిత కుటుంబానికి కొలుముల ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్వింటాల్ బియ్యాన్ని అందించి మానవత్వం చాటుకున్నారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు నారాయణ కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొలుముల ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు కొలుముల పెద్ద గంగన్న, ఫౌండేషన్ గ్రామ ఇన్చార్జ్ పులకొల్ల లింగమూర్తి, కొత్తూరు తాజా మాజీ సర్పంచ్ తాళ్ళ మల్లేశం గౌడ్, మెతుకు రవి పాల్గొన్నారు.

# విద్వేషాలను రెచ్చగొట్టడమే రాహుల్ నైజం..!

- **కాంగ్రెస్ ద్వేషపూరిత పార్టీ..!**
- **మోదీకి రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి**
- **బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

దేశం అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ ని అకారణంగా దూషించడమే కాక ఆయన తల్లిపై కూడా అనుచిత వ్యాఖ్యలు కాంగ్రెస్ కార్యకర్తలు చేయడం సిగ్గుచేటని వరంగల్ బిజెపి జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ధ్వజమెత్తారు. శనివారం వరంగల్ చౌరస్తాలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో జిల్లా బీజేపీ శ్రేణులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.

గంట రవికుమార్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ద్వేషపూరిత పార్టీ అని, దానికి విలువలంటూ లేవని విద్వేషాలను రెచ్చగొట్టడమే ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ నైజం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ అధికార్ యాత్ర పేరుతో బీహార్ రాష్ట్రంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన కార్యక్రమాల్లో ఆ పార్టీ కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోడీ ఆయన తల్లి పై అభ్యంతరకర రీతిలో వ్యాఖ్యలు చేయడం, దానిని రాహుల్ గాంధీ వాటిని ఖండించక పోవడం ఆయన విష సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు. విదేశీ సంస్కృతిలో పుట్టి పెరిగిన రాహుల్ గాంధీకి తల్లి విలువ ఏం తెలుసు అని ప్రశ్నించారు. ఓట్ల రాజకీయాల కోసం కన్నతల్లిని రాజకీయాల్లోకి లాగి విషపు ఆనందాన్ని రాహుల్ గాంధీ పొందుతున్నారని ఘాటుగా విమర్శించారు. జరిగిన దానికి బాధ్యత వహిస్తూ రాహుల్ గాంధీ వెంటనే ప్రధాని మోదీ ఆయన తల్లికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నరేంద్ర మోడీ నిరుపేద కుటుంబానికి చెందిన వాళ్ళని ఆయనను ఆయన తల్లి విలువలతో పెంచిందని మరి విదేశాల్లో పుట్టి పెరిగిన సోనియమ్మ రాహుల్ గాంధీకి నేర్పిన, విలువలు ఇవేనా అంటూ ధ్వజమెత్తారు.

రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేని ఓ ఆదర్శవంతమైన తల్లిని ఇలా తన స్వార్థం కోసం వాడుకోనే రాహుల్ గాంధీ దిగజారుడుతనాన్నీ దేశ ప్రజలు అసహ్యించుకుంటున్నారని గంట రవికుమార్ వెల్లడించారు.

దేశ ప్రధాని అవుతానని కలలుగా అంటున్న రాహుల్ కు రానున్న రోజుల్లో కనీసం డిపాజిట్ కూడా రాదని పేర్కొన్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ మరింతగా దిగజారుతోందని విమర్శించారు. అంతేకాదు కాంగ్రెస్ పార్టీ దిగజారుతానానికి ప్రజలు ఆ పార్టీని మరింతగా చీకొడతారని గంట రవికుమార్ పేర్కొన్నారు.

బీహార్లో ప్రజల్ని తప్పుదారి పట్టిస్తూ విద్వేషపూరిత సంస్కృతికి రాహుల్ గాంధీ ఆద్యం పోస్తున్నారని విమర్శించారు కాంగ్రెస్ ఎన్ని కుయుక్తులు పండిన దేశ ప్రజలు చూస్తున్నారని వారికి తగిన గుణపాఠం కచ్చితంగా చెబుతారని గంట రవికుమార్ పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం అనుక్షణం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతోందని రవికుమార్ పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ఓట్లు తెచ్చి పెడతాయని ..ఇలా దిగజారుడు వ్యాఖ్యలతో కాదని రవికుమార్ కాంగ్రెస్ పై ధ్వజమెత్తారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కాసు శిల్పా, మహిళా మోర్చా నాయకురాలు పిట్టల సరస్వతి, మార్త ఉషారాణి, స్వర్ణ, రాజేశ్వరి, ఉమాదేవి, స్వరూప,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బన్న ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, గడల కుమార్, ఫైర్తా ఆనంద్, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుదర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైరి నాగరాజు, సోషల్ మీడియా కన్వీనర్ నోముల రతన్,జిల్లా విశ్వకర్మ సెల్ కన్వీనర్ శ్రీరామోజు మోహన చారి, కార్యాలయ కార్యదర్శి పెద్ది నవీన్, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, అపురూప రజనీష్, బోరిగం నాగరాజు, మరియ బిజెపి నాయకులు కర్నే రవీందర్, అంకాల జనార్ధన్, వైట్ల గణేష్, మామిడాల సతీష్, అల్లి అజయ్, జెట్లింగ్ శివ, గోల రాజకుమార్ మడిపల్లి నాగరాజు గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మ్యాథ్స్ అండ్ సైన్స్ టాలెంట్ టెస్ట్ 2025


**వేద న్యూస్, చొప్పదండి :**



రాష్ట్రీయ ఆవిష్కార అభయాన్ కార్యక్రమంలో భాగంగా డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పెద్దపెల్లి మండల స్థాయి గణిత మరియు సైన్స్ క్విజ్ క్లబ్ కోసం మండల స్థాయి టాలెంట్ టెస్ట్ ను శనివారం రోజు ఎంఆర్సి జూలపల్లి నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కె. సరస్వతి పాల్గొని ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. ఇట్టి కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్ మరియు కేజీబీవీ పాఠశాలల నుండి 6 నుండి 10వ తరగతి విద్యార్థులు 36 మంది టాలెంట్ టెస్ట్ లో పాల్గొని ప్రాథమికోన్నత స్థాయిలో ఐదుగురు, సెకండరీ స్థాయిలో ఐదుగురు విద్యార్థులను జిల్లా స్థాయిలో జరిగే టాలెంట్ టెస్ట్ కు ఎంపిక అయినారు. వారి వివరాలు ఉన్నత స్థాయిలో ఉదయ్ కార్తికేయ (టిజిఎంఎస్ పెద్దాపూర్), మాణిక్ రత్ (జెడ్పిహెచ్ఎస్ తేలుకుంట), పార్థు (జడ్పీహెచ్ఎస్ వడ్కాపూర్), సాయి చరణ్ (జెడ్పిహెచ్ఎస్, వడ్కాపూర్), ఆశ్రిత (జెడ్పిహెచ్ఎస్, పెద్దాపూర్) విద్యార్థులు ఎంపికైనారు. ప్రాథమికోన్నత స్థాయిలో శివ కేశవ (టీజీఎంఎస్, పెద్దాపూర్), శాన్వి (జెడ్పిహెచ్ఎస్, తేలుకుంట) మనస్వి (ఎంపియుపిఎస్, చర్లపల్లి), తేజ శ్రీ (జెడ్పిహెచ్ఎస్, జూలపల్లి), సహస్ర (జడ్పిహెచ్ఎస్, పెద్దాపూర్). జిల్లా స్థాయిలో జరిగే గణిత మరియు సైన్స్ టాలెంట్ టెస్ట్ కు ఎంపికైన విద్యార్థులను మండల విద్యాధికారి కె. సరస్వతి అభినందించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉన్నత పాఠశాలల గణిత మరియు సైన్సు ఉపాధ్యాయులు జగన్, లక్ష్మణ్, లక్ష్మీపతి, రాజశేఖర్ రెడ్డి, యోగింద్ర ప్రసాద్, మహేష్ కుమార్, సంజీవ రెడ్డి, బుచ్చిబాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొని పరీక్ష నిర్వహించి జిల్లా టాలెంట్ టెస్ట్ కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# ఓటర్ జాబితా అభ్యంతరాలపై సమీక్షా

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం రోజున అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక సంస్థలకు సంబంధించిన ఓటర్ల జాబితా అభ్యంతరాలపై ఎంపీడీవో గుండె బాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఓటర్ల జాబితాలో చాలా లోపాలు ఉన్నాయని పలు అభ్యంతరాలు లేవనెత్తారు. మరణించిన వారి పేర్లు కూడా ఓటర్ జాబితాలో ఉన్నాయని, వివాహమై అత్తగారింటికి వెళ్లిపోయిన మహిళల పేర్లు కూడా ఓటర్ జాబితా లో వచ్చాయని అలాగే ఒకే ఇంటి పేరు కలిగిన కొంతమంది వ్యక్తులకు ఓటర్ జాబితాలో ఇంటిపేరు తప్పుగా నమోదయిందని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తన పరిధిలో ఉన్నటువంటి లోపాలను సాధ్యమైనంత వరకు సరి చేస్తానని మిగతా వాటిని ఎన్నికల సంఘానికి పంపిస్తానని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా పై లేవనెత్తిన అభ్యంతరాలను ఎంపీడీవో గుండె బాబు తహసిల్దార్ సురేష్ దృష్టికి తీసుకెళ్లగా ఓటర్ జాబితాలో ఉన్న తప్పులను అన్నిటినీ వెతికి బిఎల్ఓ లకు అందజేయాలని ఆయన సూచించారు. అనంతరం ఓటర్ల జాబితా లో ఉన్న లోపాలను సవరించడానికి ఎటువంటి తప్పులు లేకుండా ఓటర్ల జాబితా సిద్ధం చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు అంతా సహకరించాలని ఎంపీడీవో కోరారు. దానివల్ల స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో కమలాపూర్ మండల పంచాయతీ అధికారి చేతన్ రెడ్డి, సూపరింటెంట్ కరణ్ సింగ్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలి

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బీహార్ లో పాల్గొన్న సభ వేదికపై నుంచి ప్రధాని మోదీ, మాతృమూర్తిని దూషిస్తూ , అసభ్యకర వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ కుసంస్కారానికి నిదర్శనమని బీజేపీ బోయినిపల్లి మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్,అన్నారు. ప్రధాని మోదీ, తల్లిపై కాంగ్రెస్ వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ, దిష్టిబొమ్మ దహనానికి యత్నించి, ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల అధ్యక్షుడు పరశు రామ్, మాట్లాడుతూ ప్రధాని మోదీ, తల్లి గురించి అసభ్యకర వ్యాఖ్యలు , దూషణలతో కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాల స్థాయికి చేరుకుందన్నారు.కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ, చేస్తున్న పనికిమాలిన రాజకీయాలను చూసి దేశవ్యాప్తంగా ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. మోడీ, తల్లి పై రాహుల్ గాంధీ, బీహార్లో నిర్వహించిన సభా వేదికగా ప్రధాని మోదీ, తల్లిపై దూషణలు తలెత్తినందున ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోడీ, తల్లి పేదరికంలో నుంచి వచ్చిన విలువలు నేర్పారని, అందువల్లే మోదీ, ప్రధాని స్థాయికి చేరుకున్నారన్నారు. ఒక పేద తల్లి కుమారుడు 11 ఏళ్లుగా ప్రధాని పీఠంపై ఉండడాన్ని కాంగ్రెస్,జీర్ణించుకోలేకపోతుందన్నారు.మోడీ, తల్లిని దూషిస్తూ , కాంగ్రెస్ నేతలు చేసిన అసభ్యకర భాషను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి,సుంకపాక ప్రభు, కందారపు వెంకటేష్, మిర్యాల శరత్ చంద్రారెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



వేద న్యూస్

ఆదివారం ఆగస్టు 31, 2025

# నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయండి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు.శనివారం బల్దియా పరిధి లోని బెస్థం చెరువు ఉర్సు చెరువు బంధం చెరువు ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను.కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి క్షేత్ర స్థాయి లో సందర్శించి సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నిమజ్జనం ప్రశాంతం గా జరిగేలా బల్దియా తరపున అన్ని ఏర్పాట్లు చేయాలని ట్రాష్ కలెక్టర్ యంత్రం ద్వారా చెరువుల్లో కొనసాగుతున్న పూడిక తీత గుర్రపు డెక్క తొలగింపు పనులను ఇరువురు పరిశీలించారు. ఇరిగేషన్ వారి సహకారం తో పగడ్బందీ గా ఏర్పాట్లు చేయాలని అన్నారు. బల్దియా ద్వారా రహదారులపై గ్రావెల్, తగినంత లైటింగ్,, శానిటేషన్ లో భాగం గా ఎప్పటికపుడు నిమజ్జన పరిసరాలు శుభ్రం గా ఉండేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణ చందర్, అరుణవిక్టర్, మరుపల్ల రవి, మానస రాంప్రసాద్ ,సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డిఎఫ్ఓ శంకర్ లింగం, ఏంహెచ్ఓ డా.రాజేష్, ఇరిగేషన్ ఈ ఈ శంకర్, బల్దియా ఈఈలు సంతోష్ బాబు, మాధవి, లత, డిఈ లు రవికిరణ్, సతీష్, రాగి శ్రీకాంత్, ఇరిగేషన్ డిఈ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి ఏఎంసీ చైర్మన్‌గా సుకినె సంతాజీ

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి ఏఎంసీ(అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ) చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మండల అధ్యక్షుడు సుకినె సంతాజీ నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయ, సహకార శాఖ నుంచి అధికారిక ఉత్తర్వులు శనివారం విడుదలయ్యాయి. వైస్ చైర్మన్‌గా బొక్కల స్రవంతి శ్రీనివాస్ రెడ్డిని నియమించారు. సుకినె సంతాజీ చైర్మన్‌గా వైస్ చైర్మన్‌తో కలిపి 13 మంది సభ్యులను అపాయింట్ చేశారు. సభ్యులుగా జి కొమురయ్య, ఎం జగన్, షేక్ హక్కీం పాషా, జే వెంకటస్వామి, ఆర్ మొండయ్య, జి రాజయ్య, దాట్ల ప్రవీణ్, ఎం రాజయ్య, బండి సుధాకర్ నియమితులయ్యారు. పీఏసీఎస్ చైర్మన్ , డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, ఎల్కతుర్తి జీపీ స్పెషల్ ఆఫీసర్ ఏఎంసీలో సభ్యులుగా ఉంటారు. కాగా, కాంగ్రెస్ నేత సుకినె సంతాజీని ఏఎంసీ చైర్మన్ గా నియమించడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. నేతలు, కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# పోలింగ్ స్టేషన్ల పై ప్రత్యేక సమావేశం



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం శనివారం రోజున మండల పరిషత్ కార్యాలయము బోయినిపల్లి నందు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన మండల స్థాయి అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు, అందరు హాజరు అయి స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా అలాగే పోలింగ్ స్టేషన్ల యొక్క తుది జాబితా ప్రకటన కొరకు ఏమైనా అభ్యంతరాల స్వీకరణ గురించి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీల నాయకులు, ఓటర్ లిస్టులలో మార్పులు చేర్పులు యదవిదిగా ఉన్నట్లు గుర్తించినట్టు తెలిపారు.



# గణనాథుడికి ఘనంగా వీడ్కోలు

**వేద న్యూస్, వరంగల్ :**

గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడికి మూడు రోజులు పాటు ఘనంగా పూజలు నిర్వహించారు. శనివారం సాయంత్రం నిర్వహించిన్న ఉద్వసన పూజాకు ముఖ్య అతిథిగా వరంగల్ ఏఎస్పీ శుభం ప్రకాష్ పాల్గొన్నారు. అనంతరం మిల్స్ కాలనీ సీఐ బొల్లం రమేష్,సిబ్బంది ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా ఎడ్ల బండిపై మట్టి వినాయకుడిని ఉరిగింపుగా తీసుకెళ్లి ఉర్సు గుట్ట చెరువులో నిమజ్జనం చేశారు.

# కిషన్ రావు పరామర్శ

**వేద న్యూస్, వరంగల్:**



బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసు సురేష్ తండ్రి రిటైర్డ్ ఎస్సై రఘురాం ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని శనివారం తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు పరామర్శించారు. ఎర్రగట్టు గుట్టలోని దాసు సురేష్ గారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఫెయిల్

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం లోని వల్లంపట్ల,దాచారం, బోటి మీది పల్లె గ్రామాలలో వివిధ అనారోగ్య సమస్యలతో మరియు అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను పరమార్శించినారు. అనంతరం రసమయి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీరు దొంగే. దొంగ అన్నట్లుందని కుండపోత వానలో తడుస్తూ రైతులు గంటల కొద్దీ నిలబడి.ఆధార్ కార్డులు, పాస్ బుక్కులు, చెప్పులు క్యూలైన్లలో యూరియా బస్తాలు ఇవ్వాలంటూ రైతన్నలు అధికారుల కాళ్లు పట్టుకొని వేడుకున్నది చూస్తుంటే చాలా బాధనిపిస్తుంది అన్నారు.

దేశానికి అన్నం పెట్టే రైతన్న యూరియా అడిగితే పోలీసు లాఠీలతో కొట్టిస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ చేతగాని తనం వల్లనే కదా ఈరోజు రైతులకు ఇన్ని కష్టాలు వచ్చినాయి అని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందు చూపు లేకపోవడం వల్లనే కదా రైతులు కన్నీళ్లు పెట్టాల్సి వస్తున్నదని అన్నారు.తులం బంగారం ఇస్తామంటూ ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి,బంగారం మాట దేవుడెరుగు యూరియానే బంగారంగా మార్చిండని అన్నారు.గ్రామాలలో విచ్చలవిడిగా మద్యాన్ని ఏరులైపారిస్తున్న రేవంత్ రెడ్డి, యూరియా బస్తాలను అందుబాటులో ఉంచడంలో అట్టర్ ఫ్లాప్ అయ్యిండని బూటకపు వాగ్దానాలు చేసినంత సులువు కాదు,పరిపాలన చేయడం అంటే నమ్మి నయవంచన చేసినంత సులువు కాదని అన్నారు.తొమ్మిదిన్నరేండ్ల బిఆర్ఎస్ పాలనలో రైతులకు ఏనాడూ యూరియా కొరత రాలేదని ఏనాడూ రోడ్డెక్కాల్సిన దుస్థితి రాలేదని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లనే, ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి చేతగాని తనం వల్లనే రాష్ట్రానికి ఎరువుల కొరత వచ్చిందని ఈరోజు యావత్ రైతాంగాన్ని యూరియా కోసం నడి రోడ్డుపై నిలబెట్టిన దుర్మార్గ చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు.సాగు నీళ్లు ఇవ్వడంలోపంట కొనుగోళ్లలో,500 బోనస్ ఇవ్వడంలో,రైతు భరోసా ఇవ్వడంలో,రైతు రుణమాఫీలో ఫెయిల్ అయిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ,చివరకు యూరియా సరఫరా చేయడంలో ఫెయిల్..అయి

రైతులను కన్నీళ్లు పెట్టిస్తున్న ఈ ప్రభుత్వం ఒక ఫెయిల్యూర్ ప్రభుత్వం అని అన్నారు. మరోపక్క భారీ వర్షాలు కురిస్తే తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని పట్టణాలు అతలాకుతలమైతే వారిని పట్టించుకునే నాధుడే కరువైనారని అన్నారు. అందించే విషయంలో కూడా విఫలమైన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు రాజన్న సిరిసిల్లా జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మేన్ సిద్దం వేణు,బీఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుల పల్లె నర్సింహారెడ్డి, ఆయా గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అల్పపీడనం ప్రభావం.. మళ్లీ భారీ వర్షాలు..!

- సెప్టెంబర్ 3వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా
- హెచ్చరించిన వాతావరణశాఖ





**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణలో రాగల నాలుగు రోజులు భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. గతవారంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. వరదలు ముంచెత్తగా జనజీవనం అస్తవ్యస్తమైంది. తాజాగా వాతావరణశాఖ మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. సెప్టెంబర్ 3వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుందని.. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి.. నైరుతి వైపునకు వంగి ఒందని పేర్కొంది. ఈ క్రమంలో శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగితాల్య, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. సెప్టెంబర్ ఒకటిన రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది. 2న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. 3న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని వివరించింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073